క్లుప్తంగా

'విరాళాలు ఇవ్వాలి'

నిర్మల్‌చైన్‌గేట్: ఢిల్లీలో నిర్మించే అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యాలయానికి విరాళాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ రైతులు, ప్రజలను కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్ దగ్గర విలేకరులతో మాట్లాడారు. జిల్లా ఉపాధ్యక్షుడు గాలి మురళీమోహన్, గంగారం, రమేశ్, అఫ్జల్ పాల్గొన్నారు.

చిన్నారులకు రూ.1.41 లక్షలు సాయం


చెక్కు అందిస్తున్న సంధ్యారాణి

తానూరు: మండలంలోని బోల్సా గ్రామానికి చెందిన ఏఐఎస్‌బీ(ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్) రాష్ట్ర కార్యదర్శి జవారే రాహుల్ సతీమణి మినీష మూడు నెలల కిందట ఇద్దరు కవలలకు జన్మనిచ్చి గుండెపోటుతో మృతి చెందింది. ఈ విషయం తెలిసి రాహుల్‌కు చదువు చెప్పిన ఉపాధ్యాయురాలు సంధ్యారాణి.. చిన్నారుల కోసం తన మిత్రుల ద్వారా రూ.1.41లక్షలు సేకరించింది. గురువారం బోల్సాకు వెళ్లి రాహుల్ కుటుంబాన్ని ఓదార్చారు. చిన్నారుల సంక్షేమం కోసం తాను సేకరించిన మొత్తాన్ని అందించారు.

7నుంచి మహా పాదయాత్ర

నిర్మల్‌చైన్‌గేట్: ఎస్సీ వర్గీకరణకు మహబూబ్ నగర్ జిల్లా అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు తలపెట్టిన మాదిగల విశ్వరూప మహా పాదయాత్ర ఈనెల 7న మందకృష్ణ మాదిగ ప్రారంభిస్తారని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కుడాల స్వామి అన్నారు. ఈసందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మహా పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నందకుమార్, గంగన్న, సాయిచంద్, అశోక్ పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

తానూరు: బెల్‌తరోడాను నూతన మండలంగా ప్రకటించినందుకు సీఎం కేసీఆర్, కేటీఆర్, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చిత్రపటాలకు గురువారం గ్రామంలో నాయకులు క్షీరాభిషేకం చేశారు. బెల్‌రోతడా మండలమైతే 12 గ్రామాలకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. మండలం ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బెల్‌తరోడా సర్పంచ్ సాయినాథ్, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, కోఆప్షన్ మాజీ సభ్యుడు చంద్రకాంత్, మధు పటేల్ తదితరులు ఉన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం


పత్రాలు అందిస్తున్న ఎంపీపీ పద్మ, జెడ్పీటీసీ

లక్ష్మణచాంద: పేదలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీపీ అడ్వాల పద్మ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీపీ ఛాంబర్‌లో గృహలక్ష్మి పథకానికి ఎంపికైన 240 మంది లబ్ధిదారులకు జెడ్పీటీసీ రాజేశ్వర్‌తో కలిసి పత్రాలు అందజేశారు. అనంతరం మండలంలోని 22 గ్రామాలకు స్పోర్ట్స్ కిట్లను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. కార్యక్రమంలో డీటీ గంగాధర్, ఎంపీడీవో శేఖర్, ఎంపీటీసీ గణేశ్, మండల కోఆప్షన్ సభ్యులు సిరాజ్, బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

భోజన కార్మికుల నిరసన


ఆవుకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ఖానాపూర్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 11 రోజులుగా మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం స్పందించకుండా జాప్యం చేయడాన్ని నిరసిస్తూ గురువారం మధ్యాహ్న భోజన కార్మికులు ఆవుకు వినతిపత్రం అందించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఖానాపూర్, పెంబి మండలాల కార్మికులు దీక్షలో కూర్చొన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, రాధ, మంజుల, పద్మ, విజయ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

నిర్మల్‌చైన్‌గేట్: సోన్ మండల కేంద్రంతో పాటు లెఫ్ట్ పోచంపాడ్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. తన క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ఇంటింటికీ తీసుకెళ్లి పార్టీ గెలుపునకు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.

సర్కారు దవాఖానాకు సుస్తీ


ఇక్కడ కనిపిస్తున్నది కడెం పీహెచ్‌సీలోని డాక్టర్ ఖాళీ కుర్చీ.. ఇక్కడ డాక్టర్‌గా విధులు నిర్వహించిన శివకుమార్ రెగ్యులర్ స్థానమైన పెంబి ఆసుపత్రికి వెళ్లారు. దీంతో గత మూడు రోజులుగా ఆసుపత్రిలో డాక్టర్ కోసం రోగులు వచ్చి వెళ్తున్నారు. కొందరు అప్పులు చేసి ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారు. ఇప్పటికైనా ఆసుపత్రికి రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలని మండల వాసులు వేడుకుంటున్నారు.


ఖాళీగా దర్శనమిస్తున్న డాక్టర్ కుర్చీ, నిరీక్షిస్తున్న రోగులు

- కడెం పీహెచ్‌సీలో అందని వైద్యం
- ఖాళీగా డాక్టర్ పోస్టులు
- కానరాని ఇన్‌చార్జి వైద్యాధికారి
- కలెక్టర్ చెప్పినా పట్టించుకోని డీఎంహెచ్‌వో
- పేదలకు అందని వైద్యసేవలు
- అప్పులు చేసి ప్రైవేటు బాట పడుతున్న రోగులు

కడెం: వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, పాలకులు పట్టించుకోకపోవడంతో కడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో పేదలకు వైద్యసేవలు అందడం లేదు. ఐదుగురు డాక్టర్లకు ప్రస్తుతం ఒక్కరే ఇన్‌చార్జి వైద్యాధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. మిగతా నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇన్‌చార్జి డాక్టర్ కూడా సక్రమంగా విధులకు రావడం లేదు. అసలే వర్షాకాలం.. దీనికి తోడు డెంగీ, మలేరియా జ్వరాలు విజృంభిస్తుండటంతో ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. కానీ డాక్టర్ లేక వారంతా నిరాశతో వెనుదిరుగుతున్నారు. కొందరు అప్పులు చేసి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్నారు.


కడెం ప్రభుత్వ ఆసుపత్రి

అరకొర సిబ్బంది..

2019లో అప్పటి సీఎం రాజశేఖరరెడ్డి హయాంలో కడెంలో 30 పడకలతో పీహెచ్‌సీ భవనం ప్రారంభించారు. ఇక్కడి పీహెచ్‌సీలో అన్ని వసతులున్నా.. పూర్తిస్థాయి సిబ్బంది లేకపోవడమే అసలు సమస్య. మొత్తం 26 మంది సిబ్బందిగాను ప్రస్తుతం 14 మందే విధులు నిర్వర్తిస్తున్నారు. నాలుగు డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారు. ముగ్గురు స్టాఫ్‌నర్సులకు ఒక్కరే ఉన్నారు, ఫార్మసిస్టు పోస్టు కూడా ఖాళీగానే ఉంది.

వారం రోజులుగా పత్తాలేని ఇన్‌చార్జి డాక్టర్

కడెం ప్రభుత్వ ఆసుపత్రికి ఏళ్లుగా రెగ్యులర్ డాక్టర్ లేకపోవడం గమనార్హం. రోజు 120 మందికి పైగా ఓపీ, ప్రతి నెల సుమారు పది మందికి సాధారణ ప్రసవాలు జరుగుతుంటాయి. అయినప్పటికీ కడెం ఆసుపత్రికి రెగ్యులర్ డాక్టర్‌ను నియమించలేదు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ శివకుమార్‌కు కడెంతో పాటు అదనంగా పెంబి పీహెచ్‌సీ బాధ్యతలు అప్పగించారు. ఆయన కూడా గత వారం రోజులుగా ఆసుపత్రికి రావడం లేదు. దీంతో వైద్య సిబ్బంది రోగులకు చికిత్స అందించి పంపిస్తున్నారు.

అరకొర పరీక్షలు..

నిబంధనల ప్రకారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్యాధికారి విధులు నిర్వర్తించాలి. ఇక్కడ ల్యాబ్‌లో కూడా పూర్తిస్థాయిలో వైద్యపరీక్షలు చేయడం లేదు. దీంతో కొందరు సీబీపీ పరీక్షల కోసం ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్తున్నారు.

అక్కడ అలా..

నిర్మల్ నియోజకవర్గంలోని మామడ, సారంగపూర్, లక్ష్మణచాంద తదితర మండలాల్లో పీహెచ్‌సీకి ఇద్దరు చొప్పున డాక్టర్లు ఉన్నారు. కానీ ఖానాపూర్ నియోజవర్గంలోని కడెం, పెంబి ఆసుపత్రులకు ఒక్క డాక్టర్‌నే నియమించడం వివక్షేనని మండలంలోని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మా కష్టాలు తీర్చాలి


ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లలేని పరిస్థితి మాది. ఎందరో పేదలకు వైద్యం అంది స్తున్న సర్కారు దవాఖానా లో డాక్టర్లను నియమించి మా కష్టాలు తీర్చాలి. – కమల, లక్ష్మిసాగర్

త్వరలోనే నియమిస్తాం


కడెం పీహెచ్‌సీలో విధులు నిర్వర్తించిన డాక్టర్ శివకుమార్ ఇటీవల డెప్యూటేషన్‌పై పెంబి ఆసుపత్రికి వెళ్లాడు. ప్రస్తుతం కడెం ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్యుడు లేడు. ఇన్‌చార్జి వైద్యాధికారి విధులు నిర్వర్తిస్తున్నాడు. త్వరలో కడెంలో వైద్యాధికారిని నియమిస్తాం.
– ధన్‌రాజ్, జిల్లా వైద్యాధికారి

నేడు ఎమ్మెల్యే రేఖానాయక్ రాక

ఖానాపూర్: ఖానాపూర్‌లో జాన్సన్‌నాయక్‌ను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంతో అసంతృప్తితో ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే రేఖానాయక్ కొద్ది రోజులుగా ఢిల్లీ, హైదరాబాద్ ప్రాంతాల్లో పర్యటించి శుక్రవారం ఖానాపూర్‌కు రానున్నారు. ఎమ్మెల్యే భర్త శ్యాంనాయక్ కాంగ్రెస్‌లో చేరి ఆసిఫాబాద్‌లో ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్యే పేరిట కాంగ్రెస్ అధిష్ఠానం వద్దకు దరఖాస్తు వెళ్లడంతో ఆ పార్టీ నుంచే పోటీ చేస్తారనే ఊహాగానాలు వచ్చాయి. శుక్రవారం ఖానాపూర్‌లో పత్రిక సమావేశం ఏర్పాటు చేసి బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసే అవకాశాలు ఉన్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. రాజీనామా చేస్తే ఇండిపెండెంట్‌గానా, రెబల్‌గా పోటీ చేస్తారా అనే అంశాలు చర్చకు దారి తీశాయి.

'పట్టించుకోని ప్రభుత్వం'

భైంసారూరల్: కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోస్లే మోహన్‌రావుపటేల్ ఆరోపించారు. గురువారం పల్లెపల్లెకు బీజేపీ గడప గడపకూ మోహన్‌రావు కార్యక్రమం కొనసాగించారు. మండలంలోని ఖత్‌గాం గ్రామానికి వెళ్లిన ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

మత్తుకు దూరం ఉండాలి

నిర్మల్‌ఖిల్లా/నిర్మల్‌రూరల్: యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరం ఉండాలని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ అల్లాడి సురేశ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దినచర్యలో స్మృతి, విస్మృతి ప్రభావాన్ని, అభ్యసనంలో పాటించే పద్ధతులను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ ఆతిక్ బేగం, జంతుశాస్త్ర విభాగం అధ్యాపకులు నరేందర్, రఘు, గణపతి, రవికుమార్, పీజీ.రెడ్డి, రమాకాంత్, సరిత, శంకర్, శ్రీహరి, రంజిత్, రవీందర్, దిలీప్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలు పంపిణీ

లక్ష్మణచాంద: ఆడబిడ్డలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించిన బతుకమ్మ చీరలను మండలంలోని తిర్పెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కొరిపెల్లి క్రిష్టారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 13,329 చీరలు వచ్చాయని.. గ్రామాల్లో వీవోఏలు మహిళలకు అందిస్తారని పేర్కొన్నారు.

సోన్: మండలకేంద్రంలో జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, గ్రామాల్లో నాయకులు గురువారం మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్ రెడ్డి, ఐకేపీ ఏపీఎం గంగామణి, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాజేశ్వర్ పాల్గొన్నారు. మండలంలోని గాంధీనగర్ పంచాయతీ కార్యాలయంలో చీరల పంపిణీలో సర్పంచ్ మమత, కార్యదర్శి సంగీత, వీవోఏ బస్వరాజ్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని బీర్నంది గ్రామంలో గురువారం బతుకమ్మ చీరలను ఎంపీపీ మోహిద్ మహిళలకు పంపిణీ చేశారు. సర్పంచ్ సాగి సువర్ణ, వైస్‌ఎంపీపీ వాల్‌సింగ్ తదితరులున్నారు.

సారంగపూర్: మండలకేంద్రంలోని పంచాయతీ భవనంలో మహిళలకు బతుకమ్మ చీరలు, ఎంపీడీఓ కార్యాలయంలో స్పోర్ట్స్ కిట్లను ఎంపీపీ మహిపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. సర్పంచ్ సుజాత, అడెల్లి సర్పంచ్ సుచరిత, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ఆయిటి చందు, మాధవరావు, అల్లోల మురళీధర్‌రెడ్డి, కౌట్ల(బి), ఆలూరు పీఏసీఎస్ చైర్మన్లు నారాయణరెడ్డి, మాణిక్‌రెడ్డి, ఎంపీడీఓ సరోజ, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీఓ తిరుపతిరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


ఖానాపూర్‌లో పంపిణీ చేస్తున్న ఎంపీపీ మోహిద్

కుంటాల: మండల పరిషత్ కార్యాలయంలో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఎంపీపీ గజ్జారాం యాదవ్, వైస్ ఎంపీపీ మౌనిక నవీన్, సర్పంచులు సమత, కనీస్ ఫాతిమా, శృతి, హైమద్, ఆనందరావు పటేల్, బాపురావ్, మగ్గిడి దిగంబర్, ఎంపీటీసీలు సుధాకర్, మోహన్, గిరీష్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం, లక్ష్మి, ఏపీఎం అశోక్ తదితరులు పాల్గొన్నారు.


భైంసారూరల్: చీరలు అందిస్తున్న ఎంపీపీ కల్పన

దస్తురాబాద్: మండలంలోని మున్యాల గొడిసీర్యాల, భూత్కూర్, రేవోజీపేట, దస్తురాబాద్ గ్రామపంచాయతీల్లో బతుకమ్మ చీరలను ఎంపీపీ సింగరి కిషన్ పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సంతపురం శారద, వైస్‌ఎంపీపీ రాజునాయక్, సర్పంచ్ రాజమణి, ఎంపీడీవో విజయ్‌భాస్కర్ రెడ్డి, ఎంపీవో అనిల్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండల పరిషత్ కార్యాలయంలో బతుకమ్మ చీరలు, సర్పంచ్‌లకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు సంజీవ్‌రెడ్డి, పిప్పెర కృష్ణ, కోఆప్షన్ సభ్యులు గజానంద్, సర్పంచులు గణేశ్, సతీశ్, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ మాణిక్‌రావు, నర్సారెడ్డి, ఎంపీవో మోజం హుస్సేన్, భైంసా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ముథోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి తెలిపారు. గురువారం బాసర ఎంపీడీఓ కార్యాలయంలో 58 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలను అందించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌నే గెలిపించాలని కోరారు.

ప్రొసీడింగ్ కాపీ అందజేత

నర్సాపూర్(జి): మండలంలోని బామిని(బి)లో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.నాలుగున్నర లక్షల ప్రొసీడింగ్ కాపీని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తన నివాసంలో ఆ సంఘం సభ్యులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. డీసీసీబీ డైరెక్టర్ వెంకటేష్, నాయకులు పోశెట్టి, ఖదీర్, భోజన్న, సంతోష్, అనిల్ పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా తెలంగాణ..

తానూరు: సంక్షేమ పథకాల అమలులో దేశానికే తెలంగాణ ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో స్పోర్ట్స్ కిట్లు, బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ప్రతి పంచాయతీకి రూ.1.20 లక్షల విలువైన క్రీడా సామగ్రి అందిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం కోలూరులో రూ.53 లక్షల విలువైన పనులకు భూమిపూజ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల శిబిరాన్ని సందర్శించారు. కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. బాశెట్టి రాజన్న, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పోతారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌రావ్ పటేల్, బాలేరావ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


బాసరలో లబ్ధిదారులతో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

ముథోల్: మండల కేంద్రంలో గురువారం పంచాయతీల సర్పంచ్‌లకు స్పోర్ట్స్ కిట్లు, మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అయేషా అఫ్రోజ్‌ఖాన్, జెడ్పీటీసీ సురేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, సర్పంచ్ రాజేందర్, ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, మగ్దూమ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులున్నారు.

ఆశవర్కర్ల నిరసన


డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న ఆశవర్కర్లు

నిర్మల్‌చైన్‌గేట్: సేవలను గుర్తించి తమ సమస్యలు పరిష్కరించాలని ఆశవర్కర్లు తమ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సమ్మె శిబిరం నుంచి ర్యాలీగా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం చేరుకొని నిరసన తెలిపారు. అనంతరం డీఆర్వో లోకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ఆశాలకు ఇస్తున్న పారితోషికాలను రూ.18వేలకు పెంచి, ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా కల్పించాలన్నారు. ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం పోస్టుల్లో ఆశాలకు ప్రమోషన్ సౌకర్యం కల్పించి వెయిటేజీ మార్కులు నిర్ణయం చేయాలన్నారు. సర్వే బిల్లులు చెల్లించాలని కోరారు. కేంద్రం ఇచ్చిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు రూ.వెయ్యి చొప్పున చెల్లించాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు పి.గంగామణి, ఆశ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు బి.సుజాత, భాగ్య, రామలక్ష్మి, అనురాధ, రాధ, ప్రమీల, లత, సౌమ్య, సుజాత, లక్ష్మి పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్లు పంపిణీ

మామడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం సమకూర్చిన స్పోర్ట్స్ కిట్లను కార్యదర్శులకు వైస్‌ఎంపీపీ లింగారెడ్డి ఎంపీడీవో రమేశ్ పంపిణీ చేశారు. సర్పంచ్ హన్మాగౌడ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ కొంద్ర రేఖ, ఎంపీడీఓ అల్లాడి వనజ ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లేశ్, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, కోఆప్షన్ సభ్యులు ఫసి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో సోలమాన్‌రాజ్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, వైస్ ఎంపీపీ నారాయణ్‌రెడ్డి, భోజన్న, ప్రశాంత్ పాల్గొన్నారు.


లోకేశ్వరంలో సామగ్రి అందిస్తున్న శ్యాంసుందర్

కుంటాల: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గజ్జారాం యాదవ్ స్పోర్ట్స్ కిట్లను సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మౌనిక నవీన్, సర్పంచ్‌లు సమత, కనీస్ ఫాతిమా, శృతి, ఆనందరావు పటేల్, హైమద్, మగ్గిడి దిగంబర్ పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 13 గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఎంపీపీ సింగరి కిషన్ స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ రాజునాయక్, జెడ్పీటీసీ శారద, సర్పంచ్ రాజమణి, ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీవో అనిల్, ఐలయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'రాష్ట్ర ప్రభుత్వం విఫలం'

ఖానాపూర్: పేదప్రజలకు మెరుగైన విద్య, వైద్యం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు కుక్కరికారి రాజేశ్ అన్నారు. గురువారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. బీఎస్పీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని.. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నాయకత్వంలో బహుజన రాజ్యం స్థాపించుకోవాలన్నారు. నియోజకవర్గ టికెట్ బన్సీలాల్ రాథోడ్‌కు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ జోసెఫ్ గంగయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పెంబి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ప్లాస్టిక్ వినియోగానికి దూరం ఉండాలని ఎంపీపీ కవిత అన్నారు. స్వచ్ఛతా హీ సేవా పక్షత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలో అధికారులు ర్యాలీ నిర్వహించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వైస్ ఎంపీపీ గంగారెడ్డి, సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో రత్నాకర్‌రావు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

కస్తూర్బాలో వ్యాసరచన పోటీలు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం 'వన్యప్రాణి సంరక్షణ' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఎఫ్ఎస్ఓ అలేఖ్య, ఎఫ్‌బీఓ అనుమప, ఎస్ఓ సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూమిపూజ

మామడ: మండలంలోని కమల్‌కోట్‌లో రూ.20లక్షలతో నిర్మించే పంచాయతీ భవన నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ చైర్మన్ హరీశ్‌కుమార్, రాంకిషన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు లింగారెడ్డి, గంగారెడ్డి, లింగారెడ్డి, సర్పంచ్ ముత్యంరెడ్డి, ఎంపీటీసీ బొజ్జ రాధ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

సోన్: మండల కేంద్రంలోని బాగులవాడ కాలనీలో దాసరి శ్రీనివాస్ ఇంటి నుంచి షేర్ నర్సయ్య ఇంటి వరకు నిర్మించే డ్రెయినేజీ పనులను జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్ రెడ్డి, రాజేశ్వర్, ఎంపీటీసీ లింగవ్వ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో గురువారం రూ.రెండు లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ జంగిలి సరిత ప్రారంభించారు. కార్యక్రమంలో చెప్యాల వెంకట్‌రాజు, ఆకుల వెంకాగౌడ్, అనుప హరీశ్, జంగిలి శంకర్, రాము, అశోక్, వెంకట్రాములు, రాజేందర్, నర్సయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ భవన నిర్మాణానికి భూమిపూజ

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) గ్రామంలో రూ.15లక్షలతో నిర్మించే ఐకేపీ భవన నిర్మాణానికి సర్పంచ్ చాట్ల లక్ష్మి రమేష్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్ల వెంకట్రామిరెడ్డి, పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, పోశెట్టి, పీఆర్ ఏఈ శరత్, మహిళలు, తదితరులు ఉన్నారు.

పనులకు భూమిపూజ

సారంగపూర్: మండలంలోని మహవీర్‌తండా పంచాయతీలోని దుర్గానగర్‌లో గురువారం సర్పంచ్ పవార్ తిరుమల, ఎంపీటీసీ సభ్యుడు రాజు పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. దుర్గానగర్‌లో రూ.4.60లక్షలతో చేపట్టే సీసీరోడ్డు, రూ.4.60లక్షలతో చేపట్టే మురికి కాలువ పనులతోపాటు మహవీర్‌తండాలో పంచాయతీ భవనం ఎదుట రూ.80వేలతో బోరుబావి ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పవార్ ఉత్తం, వార్డు సభ్యులు సూర్యవంశీ, గౌలన్ బాయి, గ్రామస్తులు దుత్యాజీ నాయక్, ఛత్రు, నవరత్, సుభాశ్ తదితరులు ఉన్నారు.

పనులకు భూమిపూజ

లోకేశ్వరం: మండలంలోని గ్రామాల్లో గురువారం పలు అభివృద్ధి పనులకు జెడ్పీ మాజీ చైర్మన్ శ్యాంసుందర్ భూమిపూజ చేశారు. మన్మద్‌లో రూ.రెండు లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్, ఉపాధి నిధులు రూ.15లక్షలతో మురికి కాలువలు, సీసీ రోడ్లు, సేవాలాల్‌తండాలో రూ.20 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణం, పంచగుడిలో సీసీ రోడ్డు, పంచాయతీ భవన నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, రత్నాకర్‌రావు, వైస్ ఎంపీపీ నారాయణ్‌రెడ్డి, సర్పంచ్‌లు శేఖర్‌రెడ్డి, ఎల్లన్న, భుజంగ్‌రావు తదితరులున్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

కుంటాల: మండలంలోని అంబకంటిలో డ్రెయినేజీ నిర్మాణ పనులను గురువారం సర్పంచ్ ప్రదీప్‌కుమార్, ఎంపీటీసీ సుధాకర్ ప్రారంభించారు. ఉపసర్పంచ్ రమేశ్, కార్యదర్శి ఉత్తమ్ పాల్గొన్నారు.

రాయితీ గొర్రెలు పంపిణీ

కుంటాల: మండల కేంద్రంలో గురువారం రాయితీ గొర్రెలను ఎంపీపీ గజ్జారాం యాదవ్ పలువురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పశువైద్యాధికారి ప్రకాశ్, గొల్ల గంగారం, సాయన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, బ్యాగులు పంపిణీ

భైంసారూరల్: మండలంలోని వాలేగాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం ప్లేట్లు, బ్యాగులను అందించారు. హైదరాబాద్‌కు చెందిన అక్షయ మెడికల్ ఏజెన్సీ నిర్వాహకులు బాదం శంకర్, కట్కం దత్తాత్రేయలు మూడేళ్లుగా విరాళాలు అందిస్తున్నారు. రూ.15 వేల ఖర్చుతో 80 మంది విద్యార్థులకు ప్లేట్లు, బ్యాగులను అందించారు. వారికి ఉపాధ్యాయులు సంజయ్, సుజాత కృతజ్ఞతలు తెలిపారు.

104 ఉద్యోగుల దీక్ష

నిర్మల్‌చైన్‌గేట్: ఏజెన్సీ విధానం రద్దు చేసి ట్రెజరీ ద్వారా వేతనాలు అందించాలని 104 వాహనాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్ష గురువారం కూడా కొనసాగింది. వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలన్నారు. హెల్త్‌కార్డు, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించి, 35 క్యాజువల్ లీవులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వెంకటస్వామి, రాజేందర్, శ్రీనివాస్, ఆనంద్, ప్రత్యూష, రాజేందర్, మీరాకుమారి, శామ్యూల్ పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం కోసం దాతలు విద్యుత్ పొయ్యి, వంటపాత్రలు విరాళంగా అందజేశారు. పట్టణానికి చెందిన యోగేశ్, గౌతం అనే ఇద్దరు గురువారం ఉపాధ్యాయులకు అందించారు.